క్లుప్తంగా

నకిలీ మావోయిస్టు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్ (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా కేంద్రంలో మావోయిస్టు పేరుతో డబ్బుల కోసం ప్రముఖులను బెదిరించిన వ్యక్తిని విజయనగరం వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా చినముషిడివాడకు చెందిన కుచ్చర్లపాటి వెంకటబంగార్రాజు పీపుల్స్ వార్ ఏవోబీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, యాక్షన్ కమిటీ కామ్రేడ్ సాయన్న అలియాస్ బిర్సా పేరుతో విజయనగరంలోని ఇద్దరు ప్రముఖులకు బెదిరింపు లేఖలు ఇచ్చారు. ఒకరికి రూ.25 లక్షలు, మరొకరికి రూ.20 లక్షలు ఇవ్వాలని లేఖల ద్వారా డిమాండ్ చేశారు. సంబంధిత వ్యక్తులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎస్పీ ఆదేశాలతో నగరంలోని అన్ని సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడు వెంకట బంగార్రాజుగా గుర్తించారు. అతని కదలికలపై నిఘా పెట్టి విజయనగరంలోని బాలాజీ కూడలి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి విప్లవసాహిత్యం, బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. కేసులో క్రియాశీలకంగా పనిచేసిన సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సురేంద్రనాయుడు, హెచ్‌సీ రమణరావు, కానిస్టేబుళ్లు శివశంకర్, గౌరీశంకర్‌లను డీఎస్పీ అభినందించారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేషంగా పూజలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరి పాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలపై ప్రత్యేక డ్రైవ్

సబ్బవరం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి రవీంద్రబాబు సోమవారం మీడియాకు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి అదేశాల మేరకు సబ్బవరంలోని ఎంఈవో 1, 2ల ఆధ్వర్యంలో ఈ డ్రైవ్ జరిగిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రాథమిక పాఠశాలలోను, ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను ప్రాథమికోన్నత పాఠశాలకు, ఆ స్థాయి తర్వాతి విద్యార్థులను ఉన్నత పాఠశాలలో చేర్పించినట్లు వెల్లడించారు. నూతనంగా చేరిన విద్యార్థులను ఆయా పాఠశాలల్లోని యూడైస్ పోర్టల్‌లో చేర్చి, అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సమగ్ర విద్యాభ్యాసం, పర్యవేక్షణకు పెద్దపీట వేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 13 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.1.30 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ పనులు సత్వరం పూర్తిచేయాలి



అధికారులకు సూచనలు చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖ సిటీ: మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, వాణిజ్య సముదాయ భవనం, హెలీకాప్టర్ మ్యూజియానికి సంబంధించిన అన్ని పనులను ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వాటిని ప్రారంభించనున్న నేపథ్యంలో సోమవారం ఈ రెండు ప్రాజెక్టులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిన పనులు ఏమైనా మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. ఈ పర్యటనలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్‌ఈలు భవానీశంకర్, బలరామరాజు, ఈఈలు మధుసూదన్, రామరాజు, దుర్గాప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై నిఘా నేత్రం



పట్టణ శివారు ప్రాంతాల్లో ఆకతాయిల ఆగడాలు శృతిమించుతున్నాయి. తోటలు, లేఅవుట్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ప్రాంగణాలు ఇలా అన్ని ప్రాంతాల్లో చీకటి పడితే చాలు వారు చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గంజాయి సేవనంతో పాటు ఇతర మత్తు పదార్థాల వినియోగం పెరిగింది. ఆ మత్తులో కొందరు బరితెగించి సామాన్యులపై దాడులకు దిగుతున్నారు. వీటి నియంత్రణకు పెందుర్తి పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు.



పెందుర్తి ప్రాంతంలో డ్రోన్ సాయంతో పరిశీలిస్తున్న పోలీసులు

వివాదాస్పద ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా

వినూత్న పంథాలో నేరాలకు చెక్ పెడుతున్న పెందుర్తి పోలీసులు

బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు డ్రోన్ కెమెరాతో చెక్

పెందుర్తి: ఇటీవల కాలంలో పెందుర్తి ప్రాంతంలో మద్యం, గంజాయి, దారి దోపిడీల కేసులు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ప్రతిఘటించే వారిపై హత్యయత్నాలకు కూడా వెనుకాడట్లేదు. ఇక కొన్ని గ్రామాల్లో రాజకీయ, వ్యక్తిగత కారణాలతో తరచూ వివాదాలు నెలకొంటున్నాయి. మహనీయుల విగ్రహాల మీద దాడులు, వాటిపై చెలరేగుతున్న స్థానిక విద్వేషాలు మరింత ఆందోళనను పెంచుతున్నాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు పోలీసులు వినూత్న పంథాను అనుసరిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, వివాదాస్పద ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి సమయంలో ఆకతాయిల ఆట కట్టించేందుకు సరికొత్తగా డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాలు, వినియోగంలో లేని లేఅవుట్‌లలో జరుగుతున్న 'చీకటి'కార్యకలాపాలకు చెక్ పెడుతున్నారు.

పెరుగుతున్న మత్తు వినియోగం

గతంతో పోల్చితే పెందుర్తి ప్రాంతంలో మద్యంతో పాటు గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అన్ని సమయాల్లోనూ అందుబాటులో ఉంటున్నాయి. మద్యం బెల్ట్ దుకాణాలు ఎక్కడికక్కడ వెలిశాయి. ఇక పెందుర్తి అడ్డాగా గంజాయి అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు ఇటీవల కాలంలో వెలుగులోకి వచ్చిన పలు ఘటనలు నిరూపించాయి. దీంతో యువకులు మద్యపానంతోపాటు గంజాయి బారిన ఎక్కువగా పడుతున్నారు. రోడ్లు, పార్కులు, జనావాసాల సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో యథేచ్ఛగా మద్యపానం, గంజాయి వినియోగం జరుగుతోంది. ఈ మత్తులోనే వీరు దారుణాలకు ఒడిగడుతున్నారు.



వేపగుంట సమీపంలోని పద్మనాభనగర్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సాంకేతికతతో ఆటకట్టు

అయితే ఇటీవలకాలంలో రెచ్చిపోతున్న ఆకతాయిలకు చెక్ పెట్టేందుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ సారథ్యంలో జరుగుతున్న డ్రోన్ ప్రయోగం తొలి దశలోనే ఉన్నా మంచి ఫలితాలు ఇస్తున్నాయి. రోజూ ఓ ప్రదేశాన్ని ఎంచుకుని ఆ ప్రాంతంలో డ్రోన్ కెమెరాలను ఎగురవేస్తున్నారు. అలా బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి, క్షణాల్లో నిరోధిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదు రోజుల్లోనే దాదాపు 50 కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరిచి, చర్యలు తీసుకున్నారు.



బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని పట్టుకున్న పోలీసులు

మరింత విస్తృతంగా చర్యలు



ఇటీవల కాలంలో మత్తులో దాడులు జరుగుతున్న ఘటనలు పెరుగుతున్న మాట వాస్తవమే. అయితే ఆయా సందర్భాల్లో ఆ సమయంలో వారి మధ్య నెలకొన్న పరిస్థితిని బట్టి సదరు వ్యక్తులు దాడులు చేసుకుంటున్నారు. అయితే బహిరంగ ప్రదేశాల్లో గంజాయి వినియోగం, మద్యపాన నియంత్రణపై దృష్టి సారించాం. దీని కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అనుమానాస్పద ప్రాంతాల్లో అకస్మాత్తుగా డ్రోన్‌లు ఎగరేస్తున్నాం. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నాం. ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని విడిచిపెట్టం. ఆకతాయిలు, రౌడీషీటర్ల వలన ఇబ్బందులు ఎదురైతే మా దృష్టికి తక్షణమే తీసుకురావాలి.

– కె.వి.సతీష్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పెందుర్తి

పీజీఆర్‌ఎస్‌కు 7 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 7 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ హేమావతి అర్జీలు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చందనోత్సవంలో బాలలకు సౌకర్యాలు కల్పించాలి

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి వచ్చే బాలలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. చిన్నారులకు వారి తల్లులు పాలు పట్టేందుకు వీలుగా క్యూల్లో తగినన్ని ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. బాలలకు మంచి నీరు, వేడి పాలు, బిస్కెట్లు అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దివ్యాంగ పిల్లలకు ప్రత్యేకంగా దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తప్పిపోయిన పిల్లలను త్వరితగతిన వారి తల్లిదండ్రులకు అప్పగించేలా పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమశాఖ, చైల్డ్‌లైన్ సహాయ సహకారాలు తీసుకోవాలని సూచించారు.

మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలి



అందోళనలో పాల్గొన్న ఐద్వా మహిళ సంఘం ప్రతినిధులు

ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన

పరవాడ: స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మద్యం, మత్తు పదార్థాల్ని నియంత్రించి, తక్షణమే బెల్ట్ షాపులను తొలగించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, తినడానికి తిండి దొరక్కపోయినా తాగడానికి మద్యం మాత్రం ఎక్కడపడితే అక్కడ లభ్యమవుతోందని ఆక్షేపించారు. గుడికి బడికి తేడా లేకుండా అడుగుకో బెల్ట్ షాపు ఏర్పాటు చేసి ప్రజల్ని మద్యం మత్తులో ముంచుతున్నారని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి, రేషన్ కార్డుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల కమిటీ అధ్యక్షురాలు బి.బంగారమ్మ, కార్యదర్శి అన్నపూర్ణ, లావణ్య, సీతామహాలక్ష్మి, లక్ష్మి, శ్రీదేవి, ప్రియాంక, నాగమాల, శ్రావణి, లక్ష్మి, హేమలత, వరలక్ష్మి, మంజుల, మణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

మీరెంత మీ బతుకెంత.. అంటూ వేధిస్తున్నారు

- గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలి
- విశాఖ జిల్లా కలెక్టర్‌కు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల మొర



కలెక్టరేట్ ముందు వినతిపత్రాలతో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు

పెందుర్తి: 'మేం 19 ఏళ్లుగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నాం. కానీ ఎప్పుడూ ఎదుర్కోలేనంత రాజకీయ వేధింపులు ఇప్పుడు చవిచూస్తున్నాం. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఉన్న రాజకీయ నాయకులు మమ్మల్ని చులకనగా చూస్తున్నారు. మేం పేపర్ మీద ఒకసారి పెన్ను పెడితే మీ బతుకులు రోడ్డున పడతాయి'.. అంటూ చేస్తున్న వేధింపుల్ని తట్టుకోలేకపోతున్నామంటూ జిల్లాలోని జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు విశాఖ జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్ వద్ద వాపోయారు. తాము రాజకీయంగా ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి కాగానే తమ బతుకులు మారుతాయని అనుకున్నామన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడిన నుంచి గతంలో ఎన్నడూ లేనంతగా రాజకీయ వేధింపులకు గురవుతున్నామని వాపోయారు. చివరకు గ్రామ స్థాయి నాయకులు కూడా తమను అన్నిరకాలుగా బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించి గ్రామ పంచాయతీ ఉద్యోగిగా నియామకం జరపాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం హెల్త్‌కార్డులు, ప్రమాద బీమా, గ్రాట్యుటీ వంటి పథకాలు అమలు చేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల వారికి పెంచిన విధంగా తమకూ వేతనాలు పెంచి, పదోన్నతులు కల్పించాలని కోరారు. తమ సమస్యలకు పరిష్కారం లభించకపోతే ఈ నెల 28 నుంచి విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ల జిల్లా అధ్యక్షుడు వంకల సత్యం, ప్రధాన కార్యదర్శి అయిత ఎర్రిబాబు, ఆయా మండలాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నరవలో గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదు



నరవలో గ్రావెల్ తవ్వకాలు (పీజీఆర్‌ఎస్‌కు ఇచ్చిన ఫిర్యాదు)

పెందుర్తి మండల రెవెన్యూ పరిధి జీవీఎంసీ 88వ వార్డు నరవ ప్రాంతంలో అనుమతిలేని గ్రావెల్ తవ్వకాలను నియంత్రించాలని కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. రాజకీయ నాయకుల పలుకుబడితో ఇక్కడ నిత్యం అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ఎన్నిసార్లు దీనిపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన అగ్నిమాపక సేవా వారోత్సవాలు



విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందిస్తున్న సమీర్‌శర్మ



అగ్నిమాపక శకటాలతో మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో అగ్నిమాపక భద్రతలో సీఐఎస్ఎఫ్ సేవలు అమోఘమని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ కొనియాడారు. సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 21 వరకు నిర్వహించిన జాతీయ అగ్నిమాపక సేవా వారోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అగ్నిమాపక భద్రత చర్యలు, ప్రాముఖ్యతను వివరించారు. సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రామ్‌లఖన్‌సింగ్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై ఎన్టీపీసీ ఉద్యోగులు, కార్మికులు, మహిళలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్టీపీసీ ఆస్తులను కాపాడడంలో సీఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందన్నారు. ప్రమాదాల నివారణలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న అగ్నిమాపక సిబ్బందిని సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రామ్ లఖన్ సింగ్ అభినందించారు. కార్యక్రమంలో భాగంగా డ్రాయింగ్, వ్యాస రచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు ఈడీ సమీర్ శర్మ బహుమతులను అందించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ యూనిట్ ఎస్ఐ రాజేష్ కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గంధం అమావాస్యకు ఏర్పాట్లు

సింహాచలం: ఈ నెల 27న గంధం అమావాస్య సందర్భంగా వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో కె.సుబ్బారావు సోమవారం మీడియాకు తెలిపారు. ఆ రోజు ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశాలున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామన్నారు. 28వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఆలయంలో భగవత్ రామానుజాచార్యుల తిరునక్షత్ర పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పూజల సందర్భంగా ఆ రోజుల్లో రాత్రి 7 గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయన్నారు. ఆర్జిత సేవలతోపాటు, రాత్రి 7 గంటల తర్వాత దర్శనాలను నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. 29న మాత్రం మూర్తి కళావాహనం సందర్భంగా ఆ రోజు సాయంత్రం 6 వరకు దర్శనాలు లభిస్తాయన్నారు. ఆ తర్వాత భక్తుల్ని దర్శనాలకు అనుమతించేది లేదని పేర్కొన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని భక్తులు నిర్ణీత సమయంలోగా ఆలయానికి చేరుకుని, స్వామి వారిని దర్శించుకోవాల్సిందిగా సూచించారు.


ఆకట్టుకున్న విద్యార్థుల సృజన



విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు తదితరులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అటల్ టింకరింగ్ లేబ్స్(ఏటీఎల్) కమ్యూనిటీ డే ఉత్సవాలను పురస్కరించుకుని ఇన్‌చార్జ్ టి.రాంబాబు ఆధ్వర్యంలో ఆ పాఠశాలకు చెందిన విద్యార్థులు పలు రకాల ప్రాజెక్ట్ నమూనాలను సోమవారం ప్రదర్శించారు. సమీపంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రతిభా విద్యాలయం విద్యార్థులు పాల్గొని ఈ నమూనాలను తిలకించారు. ప్రాజెక్టుల్లో పొల్యూషన్ కంట్రోల్ యాప్ డిజైనింగ్, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, వర్టికల్ ఫార్మింగ్ మొదలైన థీమ్స్‌పై విద్యార్థులు నమూనాలను ప్రదర్శించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎంఈవో ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ ఈ ల్యాబ్‌లను ఉపయోగించుకుని, నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవి, జె.తిరుపతి రావు, డాక్టర్ కె.కన్నంనాయుడు నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు.


ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న లలిత కుమారి

పరవాడ: సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏడవ పౌష్టికాహార పక్షోత్సవాలను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వి.లలితకుమారి మాట్లాడుతూ పోషణ్ పక్వాడా వెయ్యి రోజుల ప్రాముఖ్యత, పోషణ్ ట్రాకర్‌లో లబ్ధిదారుల స్వీయ నమోదు, ఊబకాయంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ప్రసవం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలనను వివరించారు. గర్భంలో ఉన్న బిడ్డ ఆరోగ్య పరిరక్షణకు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, ఎంపీడీవో వి.ధర్మారావు, పరవాడ, రావాడ సర్పంచ్‌లు సిరపరపు అప్పలనాయుడు, మోటూరి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి, సూపర్‌వైజర్లు షేక్ షకీలా, పి.లక్ష్మి, కె.ఉమ, స్థానిక వైద్యాధికారులు పాల్గొన్నారు.

సంజీవరెడ్డి దృష్టికి స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు



ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి సమస్యలు వివరిస్తున్న రామచంద్రరావు

ఉక్కునగరం: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో స్టీల్ ఐఎన్‌టీయూసీ చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు కలిసి స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలను వివరించారు. కార్మిక టౌన్‌షిప్ క్వార్టర్స్ నివసిస్తున్న వారికి విద్యుత్ చార్జీలు యూనిట్ ధర రూ.50 పైసలు నుంచి రూ.8కి పెంచేశారని.. కంపెనీ ఉత్పత్తి మెరుగుపడినా రాయితీ పునరుద్ధరించలేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 2 వేల మందిని అక్రమంగా తీసేశారని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ఉక్కుమంత్రితో మాట్లాడి అక్రమ తొలగింపులు ఆపేలా సహకరించాలని కోరారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపేలా చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాలు, ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో 78 వార్డు కార్పొరేటర్ బి. గంగారావు నేతృత్వంలో నాయకులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యాజమాన్యం ఇప్పటికే సుమారు 1500 మంది పైగా కార్మికులను తొలగించిందని వివరించారు. ఇకపై తొలగింపులు జరగకుండా, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు పి.వి. నగేష్, వంశీకృష్ణ, భాస్కరరావు, బైరెడ్డి, అప్పారావు, నాగిరెడ్డి, అఖిలపక్ష నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, ఉమ్మిడి అప్పారావు, డి. రమణ, జానీ తదితరులు పాల్గొన్నారు.